విద్యార్థులతో రాహుల్ గాంధీ సభకు అనుమతి రద్దు.. యూపీలో రాజకీయ దుమారం 2

Neti Velugu
# నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com




నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 113 | పేజీలు : 4 | ఆగస్టు 7 శుక్రవారం 2026 | వెల రూ. 4.00/-
NALGONDA | VOL:3 | ISSUE: 113 | PAGES:4 | FRIDAY AUGUST 7 2026 | Rs. 4:00




తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనుంది. సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న

(మిగతా 2వ పేజీలో..)

## రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి ఫోన్.. డీలిమిటేషన్ బిల్లుకు మద్దతివ్వాలని విన్నపం

- రాహుల్ గాంధీకి ఫోన్ చేసిన కిరణ్ రిజిజు
- డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు కోరిన కేంద్రం
- మహిళా రిజర్వేషన్ల అమలు కోసమే ప్రయత్నమన్న రిజిజు
- మిత్రపక్షాలతో చర్చించి నిర్ణయం చెబుతానన్న రాహుల్
- కాంగ్రెస్ వైఖరిలో మార్పు లేదన్న వేణుగోపాల్


మహిళా రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఫోన్ చేసి నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరినట్లు సమాచారం.పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఈ అంశంపై రాహుల్ గాంధీతో రిజిజు మాట్లాడటం ఇది మూడోసారి అని తెలుస్తోంది. బిల్లుకు ప్రతిపక్షం సహకరిస్తే మహిళా రిజర్వేషన్ల అమలు వేగవంతమవుతుందని

(మిగతా 2వ పేజీలో..)



## అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ : భారత్ మరో కీలక క్షిపణి పరీక్షను విజయవం తంగా పూర్తి చేసింది. అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణిని విజయవం తంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ పరీక్షా కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించినట్లు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం (ఆగస్టు 6) వెల్లడించింది. ఈ ప్రయోగాన్ని స్ట్రాటజిక్



(మిగతా 2వ పేజీలో..)

## రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనలేదు: హరీశ్ రావు

- తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నారన్న హరీశ్
- కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్య
- గోదావరి జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపాటు

సిద్దిపేటలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

(మిగతా 2వ పేజీలో..)



## అగ్రకులంలో పుట్టినా.. బడుగుల కోసమే పనిచేస్తా: కల్వకుంట్ల కవిత

- సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యమన్న కవిత
- 90 శాతం బహుజనులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన
- బీసీ రిజర్వేషన్ల బిల్లుపై రేవంత్, కిషన్ రెడ్డిని నిలదీసిన టీఆర్ఎస్ అధినేత్రి
- బడ్జెట్ సమావేశాల్లోగా బిల్లు పాస్ చేయకుంటే 'ఛలో ఢిల్లీ' హెచ్చరిక
- చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సహా 11 తీర్మానాలు

సామాజిక తెలంగాణ సాధన కోసం తన పూర్తి జీవితాన్ని అంకితం చేస్తున్నట్లు 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. అట్టడుగు, అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు దక్కేవరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన "సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ"లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా కవిత

(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు.. ఆగస్టు 15న రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డుల్లా కాకుండా, వీటిపై కుటుంబ సభ్యుల ఫొటోలు, పేర్లకు బదులుగా ఒక విశిష్ట సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉంటాయి. ఈ బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

## అగ్రకులంలో పుట్టినా.. బడుగుల కోసమే పనిచేస్తా: కల్వకుంట్ల కవిత

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. రాష్ట్రంలో 90 శాతం ఉన్న బహుజన వర్గాలకు రాజకీయ, సామాజిక అవకాశాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. “కేవలం 10 శాతం ఉన్న వర్గాలు 90 శాతం అవకాశాలను అనుభవిస్తున్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ ఆశించిన సామాజిక తెలంగాణ సాధన కోసమే ఈ ఉద్యమం మొదలుపెట్టాం” అని తెలిపారు. తన కులంపై వస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ “నా పుట్టుక నా చేతిలో లేదు. కానీ ఎవరి కోసం పనిచేయాలో నిర్ణయించుకునే హక్కు నాకుంది” అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ జనాభా లెక్కల్లో మోసానికి పాల్పడిందని కవిత ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం కోసం సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కలిసి ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించారు. రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోగా బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపకపోతే, 1,000 కార్లతో ‘ఛలో ఢిల్లీ’ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ సభలో భాగంగా చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని, ట్యాంక్‌బండ్‌పై జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో పాటు మొత్తం 11 తీర్మానాలను ఆమోదించారు.

## రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా ‘జై తెలంగాణ’ అనలేదు: హరీశ్ రావు

(మొదటి పేజీ తరువాయి)

సిద్దిపేట ప్రాంతంతో జయశంకర్ కు ప్రత్యేక అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్న ఆయన... కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ కల సాకారమైందని వ్యాఖ్యానించారు. నాడు ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని... రేవంత్ ఒక్కసారి కూడా ‘జై తెలంగాణ’ అని అనలేదని విమర్శించారు. గోదావరి నదీ జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 380 టీఎంసీల నీటిని హక్కుగా సాధిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తీసుకురాకపోగా సాధించుకున్న అనుమతులను కూడా రద్దు చేసేలా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (+=వీదీ) అజెండా రూపొందుతోందని మండిపడ్డారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను పునఃసమీక్షించి రద్దు చేయాలనే అంశం అజెండాలోకి రావడం దుర్మార్గమన్నారు. ఏపీ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుతో పాటు సమ్మక్క-సారక్క ప్రాజెక్టు 47 టీఎంసీల క్లియరెన్స్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఏపీ సర్కార్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, లేని పక్షంలో ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించారు (ఇండియా మీస్సయిల్ టెస్ట్). పరీక్ష సందర్భంగా క్షిపణికి సంబంధించిన అన్ని ఆపరేషనల్, సాంకేతిక ప్రమాణాలను విజయవంతంగా అందుకున్నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అగ్ని శ్రేణి క్షిపణులు భారత వ్యూహాత్మక రక్షణ సామర్థ్యంలో కీలకమైనవి. అగ్ని-4 సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగల సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ క్షిపణి.



# రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి ఫోన్.. డీలిమిటేషన్ బిల్లుకు మద్దతివ్వాలని విన్నపం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన వివరించినట్లు సమాచారం. లేదంటే మహిళల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని కూడా రిజిజు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ అంశంపై రాహుల్ గాంధీ ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదని సమాచారం. ముందుగా కాంగ్రెస్ మిత్రపక్షాలు, ఇండియా కూటమి భాగస్వాములతో చర్చించి తర్వాత పార్టీ వైఖరిని వెల్లడిస్తామని రిజిజుకు చెప్పినట్లు తెలిసింది. అయితే డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ఆ పార్టీ ఎంపీ కే.సి. వేణుగోపాల్ బుధవారం స్పష్టం చేశారు. గత పార్లమెంట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని చెప్పారు. బడ్జెట్ సమావేశాల సమయంలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందలేదు. మహిళా రిజర్వేషన్ల పేరుతో దేశ రాజకీయ, జనాభా సమీకరణాలను మార్చే ప్రయత్నం జరుగుతోందనే ఆందోళనతోనే బిల్లును వ్యతిరేకించినట్లు కాంగ్రెస్ గతంలో తెలిపింది. అయితే ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల పరిధిలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే మద్దతు ఇస్తామని కాంగ్రెస్ ఇప్పటికే స్పష్టం చేసింది.

# విద్యార్థులతో రాహుల్ గాంధీ సభకు అనుమతి రద్దు.. యూపీలో రాజకీయ దుమారం


- విద్యార్థులతో రాహుల్ సభకు అనుమతి నిరాకరణ
- ప్రయాగ్‌రాజ్‌లో రాజకీయ వివాదం
- వర్షాలు, భద్రత కారణమని వివరణ
- బీజేపీపై కాంగ్రెస్ ఆరోపణలు
- భయపడే అనుమతులివ్వడం లేదని వ్యాఖ్య
- నిర్ణయాన్ని తప్పుబట్టిన విపక్షాలు



ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులతో నిర్వహించనున్న ‘ఛాత్రోన్ కీ గూంజ్’ కార్యక్రమం చుట్టూ రాజకీయ వివాదం చెలరేగింది. ఆగస్టు 8న ప్రయాగ్‌రాజ్‌లోని కేపీ గ్రౌండ్‌లో జరగాల్సిన సభకు ఇచ్చిన అనుమతిని చివరి నిమిషంలో రద్దు చేయడంతో కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కేపీ గ్రౌండ్ నిర్వహణ బాధ్యతలు చూసే కాయస్థ పాఠశాల ట్రస్ట్.. భారీ వర్షాలు, భద్రతా పరిస్థితులు, కోర్టు ఆదేశాల కారణంగానే అనుమతి వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది. అయితే ఇది బీజేపీ ప్రభుత్వ ఒత్తిడితో తీసుకున్న నిర్ణయమేనని కాంగ్రెస్ ఆరోపించింది. విద్యార్థులతో రాహుల్ గాంధీ మాట్లాడకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ విమర్శించారు. కోటా, డెహ్రాడూన్ తర్వాత ఇప్పుడు ప్రయాగ్‌రాజ్‌లోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొందని అన్నారు. ఎలాంటి అడ్డంకులు వచ్చినా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ వ్యవహారంపై ప్రియాంక గాంధీ కూడా స్పందించారు. “ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదు” అని వ్యాఖ్యానించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇక్రా హసన్ కూడా ఈ నిర్ణయాన్ని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉందని, అలాంటి కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రభుత్వ బలహీనతకు నిదర్శనమని అన్నారు.

# ఆరేళ్ల బాలుడి వినతిపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- బస్సు సౌకర్యం కోసం మంత్రిని కోరిన ఆరేళ్ల బాలుడు
- ఖమ్మం జిల్లాలో ప్రజా దర్బార్ సందర్భంగా ఈ ఘటన
- వారంలో బస్సు నడపాలని అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం
- సర్వే అవసరం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం



తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఒక ఆరేళ్ల బాలుడు సమర్పించిన వినతిపత్రం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ అంశంపై తక్షణమే స్పందించిన తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వారం రోజుల్లోగా బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆ చిన్నారికి హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఖమ్మం జిల్లా కల్లూరులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహించిన ‘ప్రజా దర్బార్’ కార్యక్రమంలో ఈ ఆసక్తికర ఉదంతం చోటుచేసుకుంది. ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన ఓ ఆరేళ్ల బాలుడు తన తండ్రితో కలిసి ఈ కార్యక్రమానికి విచ్చేశాడు. తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని, వెంటనే బస్సును ఏర్పాటు చేయాలని కోరుతూ స్వహస్తాలతో రాసిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశాడు. ఆ చిన్నారి చొరవను, ధైర్యాన్ని చూసి ముచ్చటపడిన మంత్రి తక్షణమే స్పందించారు. అక్కడే ఉన్న టీజీఎస్‌ఆర్టీసీ అధికారులను పిలిచి, సదరు గ్రామానికి బస్సు సర్వీసును వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అయితే, నిబంధనల ప్రకారం ముందుగా సర్వే నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు వివరించగా, మంత్రి అందుకు సమ్మతించలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారం రోజుల్లోగా బస్సు ఏర్పాటు చేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ బస్సు రాకపోతే నేరుగా తనకు ఫోన్ చేయాలని ఆ బాలుడికి భరోసా ఇచ్చారు.

## ఇంగ్లిష్ విద్య అవసరం: మదర్సాలపై మాధవీలత కీలక వ్యాఖ్యలు

- మదర్సాలలో వందేమాతరం తప్పనిసరి చేయాలన్న మాధవీలత
- జాతీయ గీతంతో పాటు ఇంగ్లిష్ విద్యను ప్రవేశపెట్టాలని సూచన
- విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య
- ‘భారత్ మాతాకీ జై’ అని నినదించేలా వారికి నేర్పించాలని డిమాండ్

బీజేపీ నేత మాధవీలత మదర్సాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. మదర్సాలలో జాతీయ గీతం ‘జన గణ మన’, జాతీయ గేయం ‘వందేమాతరం’ ఆలపించడాన్ని తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడంతో పాటు, వారికి ఆంగ్ల విద్యను కూడా అందించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఆమె మాట్లాడుతూ, “ఇది కేవలం మద్దతు తెలపాల్సిన విషయం కాదు. వాస్తవాలను గుర్తించాల్సిన అంశం. మదర్సాలలో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టాలి. అక్కడి పిల్లలను బాహ్య ప్రపంచానికి పరిచయం చేయాలి. వారిలో దేశభక్తిని పెంపొందించాలి. వందేమాతరంతో పాటు జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాలి. ‘భారత్ మాతాకీ జై’ అని నినదించేలా విద్యార్థులను సిద్ధం చేయాలి” అని పేర్కొన్నారు. విద్యాసంస్థలలో వందేమాతరం ప్రాముఖ్యతపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో మాధవీలత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవలే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కూడా గుర్తింపు పొందిన మదర్సాలలో వందేమాతరం ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని కొందరు కలకత్తా హైకోర్టులో సవాలు చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాధవీలత పోటీ చేసిన విషయం తెలిసిందే.

# ఆగస్టు 10 జైల్ బరో జయప్రదం చేయండి సిఐటియు





**నల్గొండ పట్టణం ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి**

కేంద్ర ప్రభుత్వ రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో ఆగస్టు పదిన జరుగు జైల్ బరో జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ ను పిలుపునిచ్చారు. గురువారం సిఐటియు పట్టణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ కు, పవర్లూమ్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చెరుపల్లి శ్రీనివాస్ కి భారత ఆహార సంస్థ గోదాం మేనేజర్ కు, బేవరేజ్ కార్పొరేషన్ గోదాం మేనేజర్ కు నోటీసులు అందజేసి పదిన జైల్ బరో కార్యక్రమం సందర్భంగా నల్లగొండ పట్టణంలో జరుగు నిరసన ర్యాలీలో పాల్గొంటామని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి కార్పోరేట్లకు అనుకూలంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ విధానాలు మానుకొని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని విబిజి రాంజీ పథకాన్ని రద్దుచేసి మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాలు అన్ని రకాల జాతీయ రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నల్లగొండ పట్టణ కేంద్రంలో నిరసన ర్యాలీ లో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు

ఈ కార్యక్రమంలో పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గంజి నాగరాజు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చింతకాయల సంతోష్ ఎఫ్ సి ఐ అమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సుంకరబోయిన వెంకన్న బేవరేజ్ కార్పోరేషన్ అమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు చల్ల యాదయ్య వివిధ సంఘాల నాయకులు పేర్ల సంజీవ పందుల లింగయ్య, కత్తుల సావిత్రి పెండెం బుచ్చి రాములు సూరపల్లి భద్రయ్య జేరిపోతుల సైదులు క్యాస రమేష్ పాలకూరి సైదులు జీడిమెట్ల నరసింహ పగిళ్ల రాములు వెల్కమ్ అంజనేయులు దేవులపల్లి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాధనలో జయశంకర్ పాత్ర చిరస్మరణీయం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి





**నల్గొండ జిల్లా ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి**

తెలంగాణ ఏర్పాటే తన జీవిత లక్ష్యంగా కృషిచేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. విద్యార్థి దశ నుండి చనిపోయే వరకు తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో నింపి తెలంగాణపై అవగాహన తీసుకొచ్చిన వ్యక్తి అని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన వ్యక్తుల్లో ప్రొఫెసర్ జయశంకర్ ముందు వరుసలో ఉంటారని అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం నల్గొండలోని ఇందిరా భవన్లో నిర్వహించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలలో మంత్రి పాల్గొని ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతేకాక గద్దర్ వర్ధంతి సందర్భంగా గద్దర్ చిత్రపటానికి కూడా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ కోసమే పుట్టిన వ్యక్తి అని, విద్యార్థి దశనుండే కాకుండా, పదవి విరమణ పొందిన తర్వాత కూడా తెలంగాణ కోసం ఆయన కృషి చేశారని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పలు సందర్భాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ తెలంగాణ తెచ్చుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారని తెలిపారు. శ్రీకాంత్ చారి లాంటి అమరుల బలిదానాలు, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి వారి త్యాగాల ఫలితంగా తెలంగాణ వచ్చిందని చెప్పారు. అంతేకాక వీలైనంత త్వరలో స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు, న్యాక్ సెంటర్ ద్వారా మరి కొంత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయనితెలిపారు. నల్గొండ మున్సిపాలిటీ కార్పొరేషన్ గా ఏర్పాటైన తర్వాత సుమారు 2000 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని, అవన్నీ పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఆగిపోయిన ఎస్ఎల్ బి సి సొరంగం పనులు కూడా నడుస్తున్నాయని, 700 మీటర్ల పని పూర్తయిందని, ఆగస్టు 2028 నాటికి ఎస్ఎల్బీ సి పూర్తి చేసి దేవరకొండ మొదలుకొని బ్రాహ్మణ వెల్లేముల వరకు అన్ని ప్రాంతాలకు సాగునీరు ఇచ్చి నల్గొండ జిల్లాలోని నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తామని, ఎంత కరువు వచ్చినా శ్రీశైలంలో డెడ్ స్టోరేజీ ఉన్నప్పటికి ఎస్ఎల్బీసీ ద్వారా పంటలకు సాగునీరు అందించే విధంగా డిజైన్ రూపొందించడం జరిగిందని తెలిపారు .ఎస్ఎల్బీసీ తో పాటు, తెలంగాణ లోని పాలమూరు- రంగారెడ్డి, ఇతర ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేసి తెలంగాణను సస్యశ్యామలం చేసినప్పుడే ప్రొఫెసర్ జయశంకర్ ఆత్మకు శాంతి చేకూరుతుందని తెలిపారు. ప్రపంచం ఉన్నంతవరకు ప్రొఫెసర్ జయశంకర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని మాట్లాడుతూ తెలంగాణ కోసం కృషి చేసిన వారిలో గద్దర్ ఒకరని, ఆయన తన పాటల ద్వారా తెలంగాణలో ఊరూరా తిరుగుతూ పాటల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారని తెలుపుతూ గద్దర్ కు ఘన నివాళులర్పించారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, గుమ్మల మోహన్ రెడ్డి ,కార్పొరేటర్లు, తదితరులు ఉన్నారు .

# తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ పై గరం అయిన తెలంగాణ జమీయత్ ఉలేమా ఎ హింద్!

**మైనార్టీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్న సర్కార్ వెంటనే తమ తీరును మార్చుకోవాలి..**

**మైనారిటీల హామీలు అమలు చేయాలి..**

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి..**

**జమియత్ ఉలేమా తెలంగాణ డిమాండ్!**

**నల్గొండ, ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి :**

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మైనారిటీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని జమియత్ ఉలేమా ఎ హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షా సయ్యద్ ఎహ్సానుద్దీన్ రషాదీ ఖాస్మీ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దారుల్ ఉలూమ్ లో మీడియా సమావేశంలో మాట్లాడారు. 2023 ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిన మైనారిటీ సంక్షేమ హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని కోరారు. ఆనాటి హామీలను నెరవేర్చకుండా మైనారిటీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ఎద్దేవా చేశారు. మైనారిటీ ఉప ప్రణాళికను అమలు చేసి, మైనారిటీల కోసం ప్రకటించిన రూ.4,000 కోట్ల బడ్జెట్‌ను పారదర్శకంగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ఇమామ్‌లు, ముఅజ్జిన్‌ల గౌరవ వేతనాలను పెంచి సకాలంలో చెల్లించడంతో పాటు, వక్ఫ్ ఆస్తుల రక్షణకు కఠిన చర్యలు తీసుకుని వక్ఫ్ బోర్డును బలోపేతం చేయాలని కోరారు.ఉర్దూ భాషాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టి, ఉర్దూ ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యా సహాయం, కోచింగ్, హాస్టల్ సౌకర్యాలు, రాయితీ రుణాలను పునరుద్ధరించాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు పొందలేక ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే బకాయిలన్నీ విడుదల చేసి కళాశాలలకు నిధులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమియత్ ఉలేమా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మౌలానా మఖ్దూమ్, గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ హఫీజ్ ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలానా అక్బర్ ఖాన్, జిల్లా కార్యదర్శి హాఫిజ్ ఫుర్కాన్, ముఫ్తీ రియాజ్, మౌలానా జుబైర్, మౌలానా హుస్సేన్,



మౌలానా సామీ, ముఫ్తీ ఉమర్, హాఫిజ్ మతీన్, ముఫ్తీ సోహైబ్, హాఫిజ్ హబీబ్, మౌలానా ఫిరాసత్, ఫైసల్, ముఫ్తీ ఘౌస్, హాఫిజ్ షంషుద్దీన్, ముఫ్తీ కలీమ్, మౌలానా అతా ఉర్ రహ్మాన్, మౌలానా ఫారూక్, జానీ, బాబా తదితరులు పాల్గొన్నారు.




## బెంగళూరులో జరిగే 11వ జాతీయ మహాసభ చరిత్రలో నిలిచిపోతుంది.ఈ సభ ద్వారా బీసీల ఐక్యతను దేశవ్యాప్తంగా చాటుదాం

- **మా వాటా మాకు దక్కేవరకు దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరిస్తాం బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**



**హైద్రాబాద్ ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి**

బీసీల వాటా బీసీలకు దక్కేవరకు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు బీసీలను ఏకం చేసి దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరిస్తామని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారు.ఆగస్టు 7న బెంగళూరులో జరిగే జాతీయ ఓబీసీ మహాసభ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఈ సభ ద్వారా బీసీల ఐక్యతను దేశవ్యాప్తంగా చాటి చెబుతామన్నారు.మండల్ సిఫారసులను అమలు చేస్తున్నట్టు పార్లమెంటులో ప్రకటించిన ఆగస్టు 7న ప్రతి సంవత్సరం దేశంలోని 29 రాష్ట్రాల బీసీలను ఏకం చేస్తూ జాతీయ ఓబీసీ మహాసభలను దేశంలోని అన్ని రాష్ట్రాలలో నిర్వహిస్తూ వస్తున్నామని అందులో భాగంగానే ఈనెల ఏడో తేదీన బెంగళూరులోని సిటీ యూనివర్సిటీలో ఉన్న జ్ఞాన జ్యోతి ఆడిటోరియంలో జాతీయ ఓబీసీ 11వ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు లింగం గౌడ్ తెలిపారు.

## ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగానిర్వహించుటలో రాజకీయ పార్టీలు సహకరించాలి

- **రాజకీయ పార్టీల ప్రతినిధుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ వెల్లడి**

**సూర్యాపేట ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి**



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన 'ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకగా, తప్పుల్లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ వి సి హాల్ నందు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల నమోదు మరియు సవరణ ప్రక్రియ వేగంగా సాగుతోందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూలై 24 తో ముగియాల్సిన బీఎల్ఓల ఇంటింటి సర్వే గడువును, క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఆగస్టు 10 వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన ప్రకటించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని, సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే డిజిటలైజేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తి అయినదని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉండటం, చనిపోయిన వారి పేర్లు అలాగే ఉండటం వంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు బీఎల్ఓ, బియల్ఏ లతో అవగాహన చేసుకుని ఆగస్టు 10వ తేదీ వరకు గడువు ఉన్నందువలన తప్పులు లేకుండా చూసుకోవాలని, ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను ధ్రువీకరించు కోవాలన్నారు. 2026 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమీక్షలో కొత్త పోలింగ్ స్టేషన్ల పై రాజకీయ పార్టీ నాయకులతో చర్చించడం జరిగింది. జిల్లాలోని ఓటర్లు తమ ఓటు హక్కును సరిచూసుకోవాలని, బీఎల్ఓలు ప్రతి రాజకీయ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకుని, ఓటర్ల జాబితా ప్రక్షాళనలో అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా సూచించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, సి సెక్షన్ సూపర్డెంట్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నుండి సిహెచ్ రాజేశ్వరరావు,బి జె పి నుండి చల్లమల్ల నరసింహ, ఎండి హాబిద్, బి ఎస్ పి నుండి ఎం.స్టాలిన్, బిఆర్ఎస్ నుండి కరుణాకర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నుండి డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**కుక్కట్ పల్లి ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి**





ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని కుత్బుల్లాపూర్ ప్రాజెక్ట్, మహిళ ప్రాంగణం కుక్కట్ పల్లి లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో గర్భిణీలు, బాలింతలు, పిల్లలను ఆహ్వానించి, గర్భిణీ స్త్రీలకు శ్రీ మంతాలు, 7 నెలల పిల్లలకు అన్నప్రాసన మరియు 3 సంవత్సరాల పిల్లలకు అక్షర అభ్యాసం, సామజిక వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో తల్లి పాల యొక్క ప్రాముఖ్యతను వివరించి, తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికీ ప్రయోజనాలు మరియు బిడ్డకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమానికీ అదనపు కలెక్టర్ డి డబ్ల్యు ఓ , డి ఎం కుక్కట్ పల్లి సిడిపిఓ కుత్బుల్లాపూర్ , సూపర్ వైజర్స్, అంగన్వాడి టీచర్లు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమమును ఉద్దేషించి, డిడబ్ల్యూ ఓ మాట్లాడుతూ ప్రతి తల్లి బిడ్డకు పాలు ఇవ్వాలని, 6 నెలలు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, ఆరోగ్య మరియు ఐసిడిఎస్ సిబ్బంది తల్లులకు అవగాహన కలిపించాలని, చెప్పారు. అదనపు కలెక్టర్ గారు తల్లి పాలు బిడ్డకు టీకా వంటివి, కోలేస్ట్రం తప్పని సరిగా ఇవ్వాలి అని తెలిపారు. తల్లి పాల వలన తల్లికి, బిడ్డకి ఆత్మీయ సంబంధం కొనసాగుతుంది. తల్లి పాల వలన బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది మరియు మేధాశక్తి మెరుగు పడుతుంది. ప్రసవమైన వెంటనే తప్పని సరిగా ముర్రు పాలు ఇవ్వాలి. 6 నెలలు కేవలం తల్లి పాలు ఇచ్చి, 7 వ నెల నుండి అదనపు ఆహరం ఇవ్వాలి అని మాట్లడారు. డబ్ల్యూ డిడ సిడబ్ల్యూ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది కలిసి సమాజంలోని తల్లిదండ్రులందరికీ తల్లి పాల ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించి, ప్రతి తల్లి తన బిడ్డకు పాలిచ్చేలా ప్రోత్సహించాలి అని చెప్పడం జరిగింది.

## ఆచార్య జయశంకర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

- **మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి**

**సూర్యాపేట పట్టణం ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి**




ఆచార్య జయశంకర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ చిత్రపాటనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనేక ఉద్యమాలు జరిగాయని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో రాష్ట్రం అభివృద్ధి కి బాటలు పడినాయని అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ ని అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి, వైస్ చైర్మన్ షఫి వుల్లా, కౌన్సిలర్ , కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న. కౌన్సిలర్ లు గుణగంటి హేమ సతీష్, మన్నెం అరుణమల్లేష్, తహెర్ మున్నీర్ , ధరావత్ విజయ, నాయకులు బండారు వెంకన్న,పోతురాజు అనిల్, మున్సిపల్ ఇ ఇ కిరణ్, డి ఇ ప్రణయ్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మాధవి, గౌసుద్దిన్, జూనియర్ అసిస్టెంట్ లు యాదగిరి, ఎస్ ఎ స్

## కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు కంటి పరీక్షలు





**చౌటుప్పల్ ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి**

రోజు రోజు కు మారుతున్న సాంకేతికతతో సెల్ ఫోన్లు మనిషి జీవనంలో భాగమయ్యాయి..డిజిటల్ క్లాసెస్ తో పాటు సెల్ఫోన్ల ఉపయోగం ఎక్కువగా ఉండడంతో విద్యార్థిని విద్యార్థులు చిన్నతనంలోనే కంటి సమస్యలతో బాధపడుతున్నారు.. పాఠశాల వయసులోనే కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థిని విద్యార్థులకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు.. చౌటుప్పలోని లక్కారంలో మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో ఈరోజు ఉచిత కంటి వైద్య రివ్యూ శిబిరం నిర్వహించారు... ఈ వైద్య రివ్యూ శిబిరంలో జులై 4న చౌటుప్పల్ మండలం చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రజలకు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్లకు ఎంపికై కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి మరోమారు డాక్టర్లు ఆపరేషన్ చేయించుకున్న కళ్ళను పరిశీలించారు... ఈ ఉచిత రివ్యూ వైద్య శిబిరంలో చౌటుప్పల్ పట్టణానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు 200 మంది వరకు తమ కండ్లను పరీక్షించుకున్నారు... డిజిటల్ క్లాసుల ద్వారా బోధన ఇండ్లలో సెల్ ఫోన్లు ఎక్కువగా చూడటం వల్ల కంటి రెటీన పై ఒత్తిడి తీవ్రంగా పడుతుండడంతో కళ్ళు మస్కబారి పోవడం లాంటి చిన్న చిన్న సమస్యలతో బాధపడుతున్న వారు ఈ శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు... కండ్లను పరిశీలించిన డాక్టర్లు విద్యార్థిని విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ అవసరం ఉన్నవారికి కళ్ళజోళ్లను ఉపయోగించాలని చెప్పారు.


## తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సేవలు చిరస్మరణీయం : కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్గొండ ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన జీవితాన్ని ధార పోసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92 వ జయంతిని పురస్కరించుకొని, గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి ఆయన పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను కొనియాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ విద్యార్థి దశ నుండే తెలంగాణ భావజాలాన్ని వ్యాపింప చేశారని ,తెలంగాణ సిద్ధాంతకర్తగా ఆయన పేరు పేరొందారని అన్నారు. శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్, వివిధ విభాగాల అధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాలు సమర్పించి ఘన నివాళులర్పించారు.

## 'దిష్టంతా పోవాలే'.. నాని ఒక్క డైలాగ్‌తో దద్దరిల్లిన 'ప్యారడైజ్' టీజర్



టాలీవుడ్ హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమా నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజర్ విడుదలైంది. షూటింగ్ చివరి దశకు చేరుకున్న వేళ వచ్చిన ఈ టీజర్ సోషల్ మీడియాలో మంచి స్పందన అందుకుంటోంది. టీజర్‌లో నాని ఇప్పటివరకు కనిపించని మాస్ లుక్‌లో కనిపించారు. యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ఉన్నాయి. చేతి నిండా బ్లేడ్లు పట్టుకుని కనిపించే సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'దిష్టంతా పోవాలే' అంటూ నాని చెప్పిన డైలాగ్ అభిమానులను బాగా ఆకట్టుకుంటోంది.టీజర్‌కు అనిరుధ్ అందించిన నేపథ్య సంగీతం మరో హైలెట్‌గా నిలిచింది. ప్రతి యాక్షన్ సీన్‌కు తగ్గట్టుగా వచ్చిన బీజీఎం టీజర్‌కు మరింత బలం తీసుకొచ్చింది. విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి.ఈ సినిమాలో నాని సరసన కాయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. టీజర్‌కు వస్తున్న స్పందనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'ది ప్యారడైజ్' వచ్చే నెల 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ -- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి.





**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పేర్కొన్నారు.ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి,నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆచార్య జయశంకర్ పాత్ర చిరస్మరణీయమని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని ఉద్యమానికి మార్గదర్శకుడిగా, సలహాదారుడిగా విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచి రాష్ట్ర సాధన కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. అధ్యాపకుడిగా అనేక మంది విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ వృత్తిపట్ల నిబద్ధత, సమాజం పట్ల బాధ్యత, తెలంగాణ పట్ల అంకితభావాన్ని పెంపొందించారని కలెక్టర్ అన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.చదువు ప్రతి ఒక్కరి జీవితాన్ని మార్చే శక్తి కలిగిన సాధనమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను పొందేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్య అనేది కేవలం పుస్తక విజ్ఞానానికే పరిమితం కాకుండా జ్ఞానం, విలువలు, క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించే సాధనంగా ఉండాలని పేర్కొన్నారు.బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని, తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో చైతన్యపరిచి, రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్తగా ఆయన చేసిన కృషి నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆచార్య జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేశురాం, వెనుకబడిన సంఘాల నాయకులు మల్లేష్ యాదవ్, కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు ఘనంగా చేయాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి






**వనపర్తి జిల్లా ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి**

ఆగస్టు 15వ తేదీన దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీన దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీస్ మైదానంలో నిర్వహించే వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు, అధికారులకు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు, అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు వేదిక ఏర్పాట్లు సహా హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించాలన్నారు. పోలీసు గౌరవ వందనంతో పాటు, బందోబస్తు కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు.వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జెడ్పి సీఈవో యాదయ్య, సిపిఓ హరికృష్ణ, ఆర్డీవో సుబ్రహ్మణ్యం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నారుల భద్రత అందరి బాధ్యత





**మానవ అక్రమ రవాణాపై సమాజమంతా అప్రమత్తం కావాలి**

**బాధితులు వెంటనే హెల్ప్‌లైన్‌లను ఆశ్రయించాలి**

**జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి**

**వనపర్తి జిల్లా ఆగస్టు 6 నేటి వెలుగు ప్రతినిధి**

మహిళలు, చిన్నారుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని అన్ని వర్గాలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి పిలుపునిచ్చారు. గురువారం వనపర్తి జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి మహిళా సాధికారత కేంద్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జడ్పీ సీఈవో యాదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా వల్ల మహిళలు, బాలికలు, చిన్నారులు ఎదుర్కొనే ప్రమాదాలు, రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. ఉద్యోగాలు, విదేశీ ఉపాధి, విద్య పేరుతో తప్పుడు హామీలు ఇచ్చి మోసం చేయడం, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని వల వేయడం, నకిలీ వివాహాలు, చిన్నారులను ప్రలోభపెట్టడం లేదా అపహరించడం వంటి మార్గాల ద్వారా అక్రమ రవాణా జరుగుతోందని వివరించారు. ఇలాంటి ముఠాల బారిన పడితే వ్యక్తిగత స్వేచ్ఛ కోల్పోవడం, శారీరక--మానసిక హింసకు గురికావడం, చదువు, భవిష్యత్తు దెబ్బతినడం, కుటుంబాలకు దూరమవడం వంటి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తులను గుడ్డిగా నమ్మవద్దని, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. అనంతరం అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మోసపు ఉచ్చులో చిక్కుకున్న బాధితులు అత్యవసర సహాయం కోసం 112 (పోలీసు అత్యవసర సేవలు), 181 (మహిళల హెల్ప్‌లైన్), 1098 (బాలల హెల్ప్‌లైన్) నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్ రెడ్డి, హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్ఐ అంజాద్, జీసీడీఓ, ఏఎస్ఓ, సీడీపీఓలు, ఆర్డీఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, డీహెచ్ఈడబ్ల్యూ స్టాఫ్, సఖి టీమ్, షీ టీమ్, భరోసా టీమ్, ఐసీపీఎస్ టీమ్, మహిళా పోలీసులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**